నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | గురువారం 8 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ధాన్యం తడవకుండా కవర్లు కప్పిన రైతులు

రైతన్నకు గుబులు

దండేపల్లి, మే7 : దండేపల్లి మండలంలో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కురిసిన వర్షం అన్నదాతకు నష్టాన్ని మిగిల్చింది. గాలి దుమారంతో పాటు వడగండ్ల వర్షం కురవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యంతో పాటు, తూకం వేసిన ధాన్యం కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డారు.

మందమర్రి : సారంగపల్లిలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

నెన్నెల : గొల్లపల్లిలో నేలకొరిగిన వరిని చూపుతున్న రైతు

అకాల వర్షం.. రైతన్నకు నష్టం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు
- గాలివానకు నేలకొరిగిన వరి.. రాలిన మామిడికాయలు
- దెబ్బ తిన్న గుడిసెలు, రేకుల షెడ్లు, పెంకుటిండ్లు
- సర్కారు ఆదుకోవాలని రైతుల వేడుకోలు

తాళ్లపేట కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

కేంద్రాల్లో ధాన్యం.. కండ్లల్లో దైన్యం

పంట అమ్ముకోవడానికి అన్నదాతల అవస్థలు

- కొనుగోలు సెంటర్లలో తీవ్ర జాప్యం
- లారీలు రాక తిప్పలు.. పేరుకుపోతున్న తూకం వేసిన బస్తాలు
- వర్షానికి తడుస్తున్న వడ్లు... తిరిగి ఆరబోసేందుకు నానా తంటాలు
- తమను గోస పెట్టవద్దని వేడుకుంటున్న రైతన్నలు

దండేపల్లి, మే 7 : అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు అమ్ముకోవడానికి నానా కష్టాలు పడాల్సి వస్తున్నది. ప్రతి గింజా కొంటామని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇటు ప్రభుత్వం, అటు అధికారులు ప్రకటనలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. పంట ప్రారంభంతో పాటు చివరి దాకా సాగు నీరందక ఇబ్బందులు పడ్డ అన్నదాలు.. తీరా చేతికొచ్చిన పంటలను సైతం అమ్ముకునేందుకు తిప్పలు పడాల్సి వస్తున్నది. లారీలు రాక కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండగా, వారంతా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కేంద్రాలతో పాటు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

తూకం వేసిన ధాన్యం కూడా తరలించేందుకు వారం పడుతుందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

వర్షానికి తడుస్తున్న వడ్లు..

ధాన్యం సేకరణలో జాప్యం వల్ల రైతులు ఆందోళనకు గురికావాల్సి వస్తున్నది. కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని వారాల తరబడి తూకం వేయడం లేదు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాకపోవడం పెద్ద సమస్యగా మారింది. మరోవైపు తూకం వేసిన వాటిని లారీల్లో తరలించినా రైస్‌మిల్లుల యజమానులు దించుకోవడంలో ఆలస్యం చేస్తున్నారు. రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి కల్లాల్లో పోసి గోనె సంచుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. తూకం ఆలస్యంతో పాటు వాతావరణంలో మార్పులు రైతన్నలను మరింత ఆవేదనకు గురిచేస్తున్నాయి. గత వారం నుంచి మబ్బులు, ఈదురుగాలులు, వర్షాలు పడడంతో ధాన్యాన్ని ఆరబోయడం, సాయంత్రం కాగానే భయంతో ధాన్యాన్ని కుప్పగా పోయడం రైతులకు తలనొప్పిగా మారింది. ధాన్యాన్ని తడవకుండా కవర్లు అద్దికు తెచ్చుకుంటుండగా, ఆ భారం కూడా రైతులపై పడుతుంది.

కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా బస్తాలు

దండేపల్లి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 35 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వెల్గనూర్, దండేపల్లి, కొర్విచెల్మ, మామిడిపెల్లి, తాళ్లపేట, నెల్కివెంకటాపూర్‌లో భారీ సంఖ్యలో బస్తాలు నిల్వ ఉండడంతో పాటు, తూకం వేయాల్సిన ధాన్యం కుప్పలు భారీగా ఉన్నాయి. సమయానికి లారీలు రాకపోవడం, తూకం వేసిన బస్తాలు మిల్లులకు తరలించడంలో ఆలస్యమవుతున్నది.

లారీల సంఖ్య పెరిగింది : బ్రహ్మయ్య, ఏపీఎం

గత రెండు రోజుల నుంచి లారీల సంఖ్య పెరిగింది. రెండు, మూడు రోజుల క్రితం వరకు కేంద్రాల్లో లారీల కొరత కారణంగా ధాన్యం అలాగే ఉండిపోయింది. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడంతో పాటు తూకం వేసిన ధాన్యాన్ని తరలించడంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. కేంద్రాల్లో సమస్యలు రాకుండా జాగ్రత్త పడుతున్నాం. కొనుగోళ్లతో పాటు, తూకం వేసిన బస్తాలు తరలింపు మరింత వేగవంతం చేస్తాం.

జన్నారం : తిమ్మాపూర్‌లో తడిసిన వడ్లను చూస్తున్న రైతు

హాజీపూర్‌లో తడిసిన ధాన్యపు బస్తాలను పరిశీలిస్తున్న రైతులు

మందమర్రి రూరల్/నెన్నెల/ కోటపల్లి/హాజీపూర్/జన్నారం/ కెరమెరి, మే 7 : మంచిర్యాల జిల్లాలో బుధవారం తెల్లవారు జామున కురిసిన అకాల వర్షానికి కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. మందమర్రి మండలం సారంగపల్లి, పొన్నారం, గుడిపెల్లి, బొక్కల గుట్ట ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు తడిశాయి. ఎప్పటికప్పుడు ధాన్యం సేకరించి మిల్లులకు తరలించాల్సి ఉండగా, అధికారుల నిర్లక్ష్యం వల్ల కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం మగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెన్నెల మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. గొల్లపల్లి, మైలారం గ్రామాల్లో వరి నేల కొరిగింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. మామిడి కాయలు నేలరాలిపోయాయి. గొల్లపల్లి, మైలారం గ్రామంలో పూరి గుడిసెలు, రేకుల షెడ్లు, పెంకుటిండ్లు దెబ్బతిన్నాయి. అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ మహేందర్‌నాథ్, ఎంపీడీవో దేవేందర్, ఏవో సృజన, ఏఈవోలు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న ఇండ్లు, పంటలను పరిశీలించారు. కోటపల్లి మండలంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో పాటు ఉరుములు కూడిన వర్షం పడగా, వడ్లు తడిసి ముద్ద అయ్యాయి. పలు గ్రామాల్లో మామిడి కాయలు నేల రాలాయి. జన్నారం మండలం పొనకల్, అక్కపెల్లిగూడ, తిమ్మాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో కురిసన వర్షానికి ధాన్యం తడిసిపోయింది.

కొనుగోళ్లలో నిర్లక్ష్యం..

హాజీపూర్ మండలంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా, రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. సెంటర్లకు ధాన్యం తీసుకొచ్చి 25 రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొన్నది. బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి కర్ణమామిడి, పడ్తన్‌పల్లి, సబ్బెపల్లి, నర్సింగాపూర్, టీకన్నపల్లి గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. వడగండ్ల వానతో పాటు ఈదురుగాలులు రావడంతో టార్పాలిన్లు కొట్టుకపోయి ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తూకం వేసిన 600 బస్తాల ధాన్యం రైస్ మిల్లులకు తరలించకపోవడంతో తడిసిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కరెంట్ షాక్‌తో రెండు ఎడ్ల మృత్యువాత

కెరమెరి, మే 7: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కెస్లాగూడ ప్రాజెక్టు సమీపంలో తెగిపడిన విద్యుత్ తీగ తగిలి రెండు ఎడ్లు మృత్యువాత పడ్డాయి. సుల్తాన్ గూడకు చెందిన షేక్ ముస్తఫా బుధవారం ఉదయం ఎడ్లబండిపై కట్టెలు తీసుకొస్తుండగా, కెస్లాగూడ ప్రాజెక్టు సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగి ఎడ్లపై పడింది. దీంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. ఈ ప్రమాదం నుంచి ముస్తఫా సురక్షితంగా బయట పడ్డాడు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ బాధితునితో కలిసి విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు.

❖ ధాన్యం వెంటనే కొనాలి..

మందమర్రి రూరల్, మే 7 : కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 15 రోజులు అవుతుంది. ఇప్పటి వరకు ఒకేఒక్క లారీ మాత్రమే వచ్చింది. పీఏసీఎస్ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ధాన్యం వర్షానికి తడిసిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వసతులు మంచిగా ఉండేవి. త్వరగా ధాన్యం కొనేవారు. రైతులకు సబ్సిడీపై టార్పాలిన్ కవర్లు అందించాలి. అద్దె టార్పాలిన్ల భారం నుంచి విముక్తి కల్పించాలి.

- పెంచాల మధు, రైతు, పొన్నారం

❖ అకాల వర్షంతో నష్టపోయినం..

మందమర్రి రూరల్, మే 7 : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యింది. తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. సర్కారు తడిసిన ధాన్యం కొని ఆదుకోవాలి.

- రాచకొండ కమల మనోహర్‌రావు, రైతు, సారంగపల్లి

❖ తూకం వేసి వారమవుతుంది

3 ఎకరాల్లో వరి సాగు చేసిన. తాళ్లపేట కొనుగోలు కేంద్రంలో అమ్ముదామని తీసుకొచ్చిన. తూకం వేసి వారమవుతుంది. ఇప్పటి వరకు లోడింగ్ చేస్తలేరు. వర్షానికి తూకం వేసిన బస్తాలు తడవడంతో వేరు చేసి ఆరబెడుతున్నాం. లారీలు రాకపోవడంతో చాలా ఇబ్బంది అవుతుంది. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలి.

- బెల్లంకొండ శ్రీనివాస్, రైతు

❖ వడ్లు తడిసినయ్

వారం కింద తాళ్లపేట కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చిన. ఇప్పటి వరకు కొనలేదు. ఆకాశం వైపు చూస్తే భయమైతుంది. ఇప్పటికే వర్షాలకు రెండు మూడు సార్లు తడిసినయ్. వడ్లు తడవకుండా పరదాలు కప్పుతున్నాం. అయినా తేమ వస్తుంది. తేమ వస్తే మళ్లీ ఆరబెడుతున్నాం. వడ్లు తొందరగా కొనాలె.

-పింగిలి రాయమల్లు, రైతు

❖ వడ్లు జల్ది కొనాలె

ఆరు రోజుల కింద వడ్లు తెచ్చినం. ఇప్పటి వరకు కొనలేదు. నా భర్తతో కలిసి వానకు తడిసిన వడ్లను నేరిపి ఎండబెడుతున్నాం. వానత్తె పరదాలు కప్పుతున్నాం. రాత్రీ.. పగలూ ఇక్కడే ఉంటాల్సి వస్తున్నది. చేతికొచ్చిన పంట యాడ వర్షానికి పోతదేమోనని భయంగా ఉంది. వడ్లు జల్ది కొని మాకు న్యాయం జేయాలి.

- జాడి లింగవ్వ, మహిళా రైతు

❖ లారీలు లేక ఇబ్బందైతుంది..

5 ఎకరాల్లో వరి వేసిన. పంట కోసి తాళ్లపేట సెంటర్‌కు తెచ్చిన. ఇప్పటికి వారమైతుంది. రేపు మాపు జోకుతాం అంటూ సతాయిస్తున్నారు. లారీలు సెంటర్‌కు రాకపోవడంతో చాలా ఇబ్బంది అవుతుంది. కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం తడవకుండా నానా కష్టాలు పడాల్సి వస్తుంది. తడిసిన వడ్లను పొద్దంతా ఆరబెట్టాల్సి వస్తుంది. కేంద్రానికి లారీల సంఖ్య పెంచి ధాన్యం కొనుగోళ్లలో స్పీడ్ పెంచాలి.

- సందెల శ్రీనివాస్, రైతు

రైతుల కష్టాలను పట్టించుకోని రేవంత్ సర్కారు

- వర్షాలకు దెబ్బ తిన్న పంటలకు ఎకరాకు రూ. 40 వేలివ్వాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

వర్షాలకు నష్టపోయిన వరిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కౌటాల, మే 7 : రేవంత్ సర్కారు రైతు కష్టాలను పట్టించుకోవడం లేదని, హామీలను నెరవేర్చక వారిని మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం కౌటాల మండలం సాండ్‌గాం, పార్డీ, వీరవెల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షానికి నష్టపోయిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు కష్టాలే తప్ప చేసిందేమీ లేదన్నారు. రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, పంటలకు బోనస్, నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించడంలో తీవ్రంగా విఫలమైందన్నారు. పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 40 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నన్ను కోసినా రూపాయి లేదని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంత పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగితే కనీసం సర్వే చేయకపోవడం దారుణమన్నారు. పంట నష్టం గురించి రైతులు విన్నవించుకున్నా స్థానిక ఎమ్మెల్యే నోరుమెదపకపోవడం శోచనీయమన్నారు. కేసీఆర్ సర్కారు రైతన్నలను అన్ని విధాలా ఆదుకున్నదని, అధికారంలో ఉన్నా.. లేకున్నా రైతుల పక్షాన నిలబడే ఏకైక పార్టీ బీఆర్ఎస్‌యేనని చెప్పారు. రైతులు అధైర్యపడ వద్దని, బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని రైతులకు ధైర్యాన్నిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ బండపటేల్,నియోజక వర్గ యూత్ నాయకులు రాజు, నవీన్, కార్తీక్, దిలీప్, రింకు మండల్ తదితరులున్నారు.

గిరి విద్యకు సహకారమందిస్తా

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, మే 7 : గిరి విద్యకు తనవంతు సహకారమందిస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఇటీవల పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులను గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి తో కలిసి బుధవారం తన నివాసంలో అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో తొలిసారి ఇంగ్లిష్ మీడియంలో పదో తరగతి పరీక్షలు రాసి అత్యుత్తమ ఫలితాలు సాధించడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, జీసీడీవో శకుంతల, ఏటీడీవోలు చిరంజీవి, ఖమర్ హుస్సేన్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు పార్వతి, అనితా, గోపి, నారాయణ మూర్తి, అశోక్, ఎస్సీఆర్‌పీలు అనంత్, రవీందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి సహకారం

క్రీడాభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ స్థాయి సీనియర్ నెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కీర్తన, దీప్తితో పాటు ఎస్‌జీఎఫ్ నేషనల్ జూనియర్ క్రీడా పోటీల్లో సత్తాచాటిన సాయి దీక్ష, అర్చన, సంజనను బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, డీవైఎస్‌వో రమాదేవి, నాయకులు నిసార్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

మంచిర్యాల టౌన్, మే 7: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం ఉదయం తమ విధులు బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు. తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, దీంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. సమానపనికి సమాన వేతనాన్ని అందించాలని, కార్మికులను రెగ్యులరైజ్‌చేయాలని కోరారు. కాగా, విధులు బహిష్కరించి నిరసన చేపట్టిన కార్మికులతో కమిషనర్ శివాజీ మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన విధంగా కార్మికుల వేతనాలను ట్రెజరీ ద్వారా అందించడం జరుగుతుందని, ఈ నెల 15వ తేదీ వరకు సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. దీంతో కార్మికులు తమ నిరసనను విరమించి విధులను నిర్వహించారు.

చెన్నూర్ పట్టణంలో మూసి ఉన్న దుకాణాలు

చెన్నూర్ పట్టణ బంద్ సక్సెస్

- పహల్గాంలో ఉగ్రదాడిపై ఆగ్రహం
- పాకిస్తాన్ డౌన్.. డౌన్ అంటూ నినాదాలు
- స్వచ్ఛందంగా దుకాణాలు మూసేసిన వ్యాపారులు
- ప్రధాన చౌరస్తాల మీదుగా బైక్ ర్యాలీ

చెన్నూర్ రూరల్, మే 7 : ఇటీవల పహల్గాంలో హిందువులు, పర్యాటకులపై జరిపిన ఉగ్రదాడిని నిరసిస్తూ బుధవారం చెన్నూర్ పట్టణంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. హిందూ సంఘాల పిలుపుమేరకు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి దుకాణాలు మూసి వేశారు. అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు సహకరించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, గాంధీ చౌక్, చెరువుకట్ట మీదుగా బైక్ ర్యాలీ తీశారు. జాతీయ జెండాలు పట్టుకొని పాకిస్తాన్ డౌన్.. డౌన్ అంటు నినాదాలు చేశారు. ఉగ్రవాదులకు దాడికి ప్రతి చర్యగా ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు తెలుపుతూ విజయోత్సవ ర్యాలీ తీశారు. పట్టణ వ్యాపారులతో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న పట్టణ ప్రజలు